

అనుమతులు తీసుకోవాలి: సబ్ కలెక్టర్

పార్వతీపురం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి తెలిపారు. మంగళవారం సబ్ కలెక్టరేట్‌లో ఏఎస్పీ అంకితా సురానతో కలిసి సమావేశం నిర్వహించారు. చవితి పండుగ నిర్వహణ, పర్యవేక్షణపై సంబంధిత అధికారులతో చర్చించారు. రోడ్డుకు అడ్డంగా ఎవరూ మండపాలు ఏర్పాటు చేయరాదన్నారు. డీజేలను అనుమతి లేదని స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరా, నిమజ్జనం సమయంలో నిర్వాహకులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈతరాని వాళ్లు, చిన్నపిల్లలు నీటిలోకి దిగకుండా చూడాలన్నారు.

గణనాథుడి పూజకు వేళాయె..

● నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం ● ముస్తాబైన మండపాలు

● కిటకిటలాడిన మార్కెట్లు ● మన్యంకు చవితి శోభ





సాలూరు మార్కెట్‌లో మట్టి గణపతి ప్రతిమలు

పార్వతీపురం/పాలకొండ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గణనాథుడి పూజకు వేళయ్యింది. నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. విద్యుత్ దీపాలతో అంతటా మండపాలు ముస్తాబయ్యాయి. బుధవారం వేడుకగా వినాయక చవితి పండుగను నిర్వహించేందుకు జిల్లావాసులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం మధ్యాహ్నం వరకూ జోరువాన కురవగా.. ఆ తర్వాత వాతవారణం మారింది. కాస్త తెరిపివ్వడంతో ప్రజలు బయటకు వచ్చి పూజా సామగ్రిని కొనుగోలు చేశారు. దీంతో జిల్లాలో మార్కెట్లన్నీ కళకళలాడాయి. ఇదే అదునుగా.. వ్యాపారులు పండ్లు, పూలు తదితర వాటిని అధిక ధరకు విక్రయించారు. ఇదిలా ఉండగా ముందస్తుగా ఆర్డర్లు ఇచ్చి వివిధ ఆకృతుల్లో తయారుచేయించుకున్న గణనాథుడి విగ్రహాలను ఉత్సవ కమిటీలు వాహనాల్లో మండపాలకు చేర్చాయి. నేటి నుంచి తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు చేసేందుకు సన్నద్ధమయ్యాయి. మండపాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో ఎక్కువ మంది అనుమతులు తీసుకున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1000 మండపాలు ఏర్పాటయ్యే అవకాశముందని అధికార వర్గాలు తెలిపాయి. ఇక మార్కెట్లో పలు ధరల్లో వినాయక విగ్రహాలు అందుబాటులో ఉండగా.. పలుచోట్ల స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా మట్టి ప్రతిమలు పంపిణీ చేశాయి. మొత్తంగా మన్యంలో చవితి శోభ కనిపించింది. అంతటా సందడి వాతావరణం నెలకొంది.



భామిని: సింగిడిలో వినాయకుడి విగ్రహాల కొనుగోలుకు తరలివచ్చిన యువత


సకల సుగుణపతి

● బొజ్జ గణపయ్య విశిష్టతలు ఎన్నో..

● నేడు వినాయక చవితి

6లో

తోటపల్లి ప్రాజెక్టులో గుర్రపు డెక్క



వదలని వర్షం

6లో

● రహదారులు, పొలాలు జలమయం

● వినాయక పూజా సామగ్రి విక్రయాలకు ఇక్కట్లు



అభివృద్ధి..పాలనలో ముని్సపల్టీ!

● దయనీయ స్థితిలో సాలూరు పురపాలక సంఘం

● ఖజానాలో నిధులు కరువు

● ప్రజలను వేధిస్తున్న సమస్యలెన్నో..

● ఆదాయంపై దృష్టి సారించని అధికారులు, పాలకవర్గం

● గత ఐదేళ్లలో 18 మంది కమిషనర్ల మార్పు

● గాడిన పడేదెప్పుడో?



సాలూరు, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కీలక నియోజకవర్గమైన సాలూరు మున్సిపాల్టీ పరిస్థితి దయనీయంగా మారింది. పాలన పూర్తిగా గాడి తప్పింది. అభివృద్ధి ఊసే లేదు. వార్డుల్లో సమస్యలేవీ పరిష్కారం కావడం లేదు. పాలకవర్గం.. అధికారులు ఎవరికివారు అన్నట్టుగా తయారయ్యారు. మున్సిపాల్టీ ఆదాయంపై కూడా దృష్టి సారించడం లేదు. ప్రజా సంక్షేమం.. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ గాలికొదిలేశారు. గత ఐదేళ్లలో సుమారు 18 మంది కమిషనర్లు మారారంటే ఇక్కడి పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఏదేమైనా ఒకప్పుడు జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన సాలూరు పురపాలక సంఘాన్ని తిరిగి గాడిలో పెట్టాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై పడింది.



అద్దెలకు ఇవ్వకుండానే పాడైన మున్సిపల్ షాపులు

ఇదీ పరిస్థితి..

● సాలూరు మున్సిపాల్టీలో 29 వార్డులున్నాయి. సుమారు 70 వేల మంది జనాభా ఉన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పురపాలక సంఘం ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదు. చెప్పుకోదగ్గ పనులేవీ జరగలేదు. ప్రధానంగా పట్టణవాసులను తాగునీరు, పారిశుధ్య సమస్యలు వేధిస్తున్నాయి. ఎక్కడికక్కడ చెత్తలు పేరుకుపోగా దోమల బెడదతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. మరోవైపు శివారు

(మిగతా 8వ పేజీలో...)

బార్ల దరఖాస్తు

గడువు పెంపు

● 29 వరకూ అవకాశం

పార్వతీపురం టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన బార్ పాలసీ 2025-28 దరఖాస్తు గడువును ఈ నెల 29 వరకూ పొడిగించినట్టు ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ ప్రొహిబిషన్ సూపరిడెంట్‌ంట్ బి.శ్రీనాథుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30న ఓపెన్ కేటగిరీ, గీత కార్మికులకు సంబంధించి కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిలో బార్లు కేటాయిస్తారని వెల్లడించారు. ఇప్పటివరకు విజయనగరం జిల్లాలో 27, పార్వతీపురం మన్యం జిల్లాలో రెండు దరఖాస్తులు స్వీకరించినట్లు పేర్కొన్నారు.



మరమ్మతులు లేక..

గుంతలు పూడ్చక

● ఇదీ గోముఖినదిపై వంతెన పరిస్థితి

8లో

కోటిపాంలోనే

గజరాజులు

● గత రెండు రోజులుగా అక్కడే సంచారం

● మొక్కజొన్న పత్తి పంటల ధ్వంసం

8లో

● లబోదిబోమంటున్న రైతులు

అవాస్తవ కథనాల

8లో

ప్రసారం సరికాదు

● టీవీ చానళ్లపై ఎస్టీ కమిషన్లకు ఫిర్యాదు చేస్తా ..

● మంత్రి సంధ్యారాణి

రేపటి నుంచి ధ్రువపత్రాల పరిశీలన

● మెగా డీఎస్సీ అభ్యర్థులకు కాల్ లెటర్లు ● మోదవలసలో ఏర్పాట్లు



సాలూరు రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ మెరిట్ లిస్ట్‌లో ఉన్న అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన గురువారం నుంచి జరగనుంది. ఇందుకు సంబంధించి విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ నెల 28 ఉదయం తొమ్మిది గంటల నుంచి డెంకాడ పరిధి 26వ హైవే పక్కన ఉన్న మోదవలస ఓయోస్టార్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 12 బృందాలు ధ్రువపత్రాలను పరిశీలించనున్నాయి. ఈ ప్రక్రియను ఉన్నతాధికారులు సైతం పర్యవేక్షించ నున్నారు. ఇప్పటికే రిజర్వేషన్, నియమ నిబంధనల ఆధారంగా కటాఫ్ మార్కులు నిర్ణయించి అభ్యర్థులకు వ్యక్తిగత లాగిన్‌కు కాల్ లెటర్లు పంపారు. ధ్రువపత్రాల పరిశీలన కోసం వెళ్లేవారు వాటిని డౌన్‌లోడ్ చేసుకొని తీసుకెళ్లాల్సి ఉంటుంది. కాగా మెగా డీఎస్సీకి దరఖాస్తు సమయంలో సర్టిఫికెట్లు ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయని వారు ప్రస్తుతం ఆ ప్రక్రియ చేపట్టాల్సి ఉంది. అప్పుడు అప్లోడ్ చేసిన వారు ఇప్పుడు కేవలం ఆధార్ కార్డు మాత్రమే పొందుపరచాల్సి ఉంటుంది. కాగా ఉమ్మడి విజయనగరం జిల్లాలో మొత్తంగా 583 పోస్టులను భర్తీ చేయనున్నారు.

ఇవి తీసుకెళ్లాలి...

మెగా డీఎస్సీ ధ్రువపత్రాల పరిశీలనకు వెళ్లే అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలను తీసుకెళ్లాలి. కేటాయించిన తేదీ, సమయానికి తప్పకుండా వెళ్లాలి. విద్యాసంబంధిత పత్రాలు, డీఎస్సీ హాల్ టికెట్, టెట్ మార్కుల కాపీ, ఇటీవల జారీ చేసిన కులధ్రువీకరణ (వర్తించిన వారికి), వైకల్యం ధ్రువీకరణ (వర్తించిన వారికి), కాల్ లెటర్‌లో సూచించిన పత్రాలు, గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించిన మూడు సెట్లు కాపీలు, ఐదు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరవ్వాలి. ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమాన్ని ఉన్నతాధికారులు పర్యవేక్షించనున్నారు. అనంతరం ఎంపికైన కొత్త ఉపాధ్యాయులకు కౌన్సిలింగ్ నిర్వహించనున్నారు. వచ్చే నెల వారు ఎంపిక చేసుకున్న పాఠశాలల్లో విధుల్లో చేరే అవకాశముంది. డీఎస్సీలో కొంత మంది అభ్యర్థులు మూడేసి పోస్టులకు సైతం మెరిట్ లిస్ట్‌లో టాపర్లుగా ఉన్నారు. అటువంటి వారు దరఖాస్తు సమయంలో ఇచ్చిన తొలి ఆప్షన్ పోస్టునే కేటాయించే అవకాశాలున్నాయని తెలిసింది.

వ్యాధులపై అప్రమత్తం

● చెత్త తరలింపుపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

● జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు



తోటపల్లిలో పారిశుధ్యంపై సమాచారం తెలుసుకుంటున్న డీపీవో

గరుగుబిల్లి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా సిబ్బంది అప్ర మత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) కొండలరావు సూచించారు. మంగళ వారం తోటపల్లి, గిజబ, సంతోషపురం, సుంకి పంచాయతీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ' వర్షాల కారణంగా అంటువ్యాధులు వ్యాపించే అవకాశం ఉంది.. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయిలో పారిశుధ్య పనులు చేపట్టాలి. చెత్త తరలింపు విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు. గ్రామాల్లో జ్వరాలు, డయేరియా బాధితులు పెరిగితే పంచాయతీ కార్యదర్శులే బాధ్యత వహించాలి. గృహాల నుంచి సేకరించిన వ్యర్థాలను వేరు చేసి సంపద కేంద్రాలకు తరలించాలి. తాగునీరు కలుషితం కాకుండా చూడాలి. రక్షిత పథకాల్లో నాచును తొలగించి.. క్లోరినేషన్ చర్యలు చేపట్టాలి.' అని తెలిపారు.

అప్పగించేదెప్పుడు?

● పీహెచ్‌సీ పనులపై కలెక్టర్ అసహనం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): సాలూరు, భద్రగిరి, కురుపాం, సీతంపేట ప్రాంతాల్లో పీహెచ్‌సీల నిర్మాణాలను పూర్తి చేసి.. ఈ నెలాఖరుకు అప్పగించాల్సి ఉన్నప్పటికీ ఇంజనీరింగ్ అధికారులు దృష్టిసారించకపోవడంపై కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అసహనం వ్యక్తం చేశారు. రోజూ ఫొటోలతో తమకు ప్రగతి నివేదిక అందించాలని ఆదేశించారు. మంగళవారం సంబంధిత అధికారులతో కలెక్టరేట్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏపీఎంఎస్ఐడీసీ ఆధ్వర్యంలో జిల్లాలో చేపడుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలను త్వరగా పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆసుపత్రుల్లో పడకలు, సిబ్బంది, మౌలిక వసతు లకు ఇబ్బందులు లేకుండా చూడాలని గతంలోనే ఆదేశించినా.. ఇప్పటివరకు వాటిపై ఎందుకు శ్రద్ధ వహించలేదని

(మిగతా 8వ పేజీలో...)

తక్షణమే గ్రౌండింగ్ చేయండి

జిల్లాలో పరిపాలనా ఆమోదం పొందని పంచాయతీ భవనాలకు ప్రభుత్వ స్థలాలను గుర్తించి తక్షణమే గ్రౌండింగ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాకు 80 గ్రామ పంచాయతీ భవనాలు మంజూరు కాగా 68కి పరిపాలనా ఆమోదం మంజూరు చేశామన్నారు. మిగిలిన వాటికి ఉత్తర్వులు పొందలేకపోవడంపై ఆరా తీశారు. వాటితో పాటు కొత్తగా సీతంపేటలో నాలుగు, పార్వతీపురం, సాలూరులో రెండు భవనాలు మంజూరైనట్లు వెల్లడించారు. ఒక్కో భవనానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షలు, ఉపాధి హామీ కంపోనెంట్ కింద రూ.7 లక్షలు కేటాయిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని 12 మండలాల నుంచి 60 మంది బ్లాక్ స్థాయి కర్మయోగులను ఎంపిక చేశామన్నారు. వీరందరికీ ఈ నెల 28, 29, సెప్టెంబరు 2, 3 తేదీల్లో సూచించిన మండలాల్లో శిక్షణ ఇచ్చేందుకు తగిన వేదికను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఐటీడీఏ ఏపీవో ఏ.మురళీకృష్ణ, ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ రాజ్ శాఖ ఇంజనీర్లు పాల్గొన్నారు.

- బొజ్జ గణపయ్య విశిష్టతలు ఎన్నో

నేడు వినాయక చవితి

సకల సుగుణపతి

రాజాం రూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి)

వినాయకుడంటే ఆదిదేవుడే కాదు.. సకల సుగుణాల దేవుడు. ఎన్నో రూపాలలో భక్తుల గుండెల్లో కొలువైన బొజ్జ గణపయ్యలో విశేషాలు ఎన్నో. మనిషిగా జీవించడం ఎలా? పెద్దలను ఎలా గౌరవించాలి? బుద్ధిబలాన్ని ఎలా ప్రదర్శించాలి? ఆటంకాలను ఎలా అధిగమించాలి? అన్నింటికీ జవాబు గణేశుడే. గణనాథుడిలోని సుగుణాలను నేటి యువత ఆచరణలో పెడితే సన్మార్గంలో జీవించడమే కాకుండా మంచి నాయకత్వ లక్షణాలు వస్తాయని పెద్దలు చెబుతున్నారు.



● బుద్ధిబలం..

గణేషుడి విశాలమైన నుదుటిభాగం ఆయన తెలివితేటలు, అపార జ్ఞానసంపదకు నిలయం. ఏపనినైనా బుద్ధిబలంతో చేయాలంటారు మన పెద్దలు. పుణ్యనదులలో స్నానమాచరించి వచ్చిన వారికి ప్రమద గణాలపై ఆధిపత్యం ఇస్తానని ఒకరోజు శివుడు షరతు పెట్టాడు. కుమారస్వామి నెమలి వాహనంపై రివ్వున వెళ్లిపోగా... వినాయకుడు మాత్రం భక్తితో అక్కడే శివపార్వతులకు ప్రదక్షిణలు చేస్తూ పోటీలో నెగ్గాడు. ఈ విధానాన్నే మన పెద్దలు చెబుతారు. బుద్ధిబలంతో కార్యాన్ని పూర్తి చేయాలన్నది వినాయకుడి నుంచే వచ్చిందట.

● వినయంగా వినాలని...

ప్రస్తుత రోజుల్లో ప్రతి ఒక్కరిలో కనిపిస్తున్న ప్రధాన లోపం ఎదుటివారు చెప్పింది ఓపిగ్గా వినకపోవడం. చెప్పేవారు ఏం చెబుతున్నారో వినకుండా మధ్యలో మనం చెప్పేందుకు ప్రయత్నిస్తుంటాం. అలా కాకుండా తక్కువ మాట్లాడాలి.. ఎక్కువగా వినాలి... అన్నదానికి సంకేతంగా వినాయకుడి చెవులను సూచిస్తారు. వినడం బాగా అలవాటు చేసుకుంటే ఎన్నో కొత్త విషయాలు తెలుసుకునే వీలుంటుంది.

● ఔన్నత్యానికి ప్రతీక తొండం

వినాయకుడిది పెద్దముక్కు... అదే తొండం. అది ఆయన ఔన్నత్యాన్ని చాటుతుంది. ఇది విఘ్నేశ్వరుడిలోని సహనానికి, సామర్థ్యానికి నిదర్శనం. తతనను తాను గౌరవించుకోవాలన్న సత్యాన్ని చెబుతుంది. అవసరమైనపుడే ఆగ్రహాన్ని ప్రదర్శించాలన్న బుద్ధిని తెలియజేస్తుంది. ఎంత ప్రమాదకరమైన పరిస్థితుల్లోనైనా ధైర్యంగా నిలబడగలగాలని వివరిస్తుంది.

● దృఢ విశ్వాసానికి...

వినాయకుడికి ఉన్నది ఒకటే దంతం. ఇది దృఢ విశ్వాసానికి ప్రతీక. చెడుజోలికి వెళ్లకుండా మంచిని మాత్రమే స్వీకరించాలని ఏకదంతుడి నుంచి గ్రహించాలంటారు మన పెద్దలు..

● సామర్థ్యానికి చిహ్నంగా..

గణేషుడి సృజనాత్మకత, సామర్థ్యానికి ప్రతీక నాలుగు భుజాలు.. సామ, ధాన, బేధ, దండోపాయాలుగా నాలుగు భుజాలను అభివర్ణిస్తారు. జీవితంలో ఏదైనా సాధించాలంటే నాలుగు ధర్మాలను అనుసరించాలని వినాయకుడి ద్వారా తెలుసుకోవచ్చును. తద్వారా ఎలాంటి సమస్యనైనా సునాయాసంగా పరిష్కరించుకోవచ్చన్న నీతి దాగి ఉందంటున్నారు పెద్దలు.

● మనపై నమ్మకానికి...

ఏపనైనా నేను చేయగలనన్న నమ్మకాన్ని కలిగిస్తుంది గణనాథుడి చేతిలోని గొడ్డలి. నేను చేయలేనన్న భావం మన మనసులోనికి రానీయకూడదన్నదే దీని అర్థం. దుష్టులను శిక్షించడానికి, మంచి కార్యక్రమానికి ఎదురైన ప్రతిబంధకాలను తొలగించేందుకు ఈ గొడ్డలిని వినియోగిస్తాడన్నది మన పెద్దల నమ్మకం.

● అభయ హస్తం..

వినాయకుడికి ఉండే నాలుగు చేతుల్లో ఒక చేతిలో మాత్రమే గొడ్డలి ఉంటుంది. మిగిలిన మూడుచేతుల్లో ఉన్నవి భక్తులను రక్షించేందుకే. మనం కూడా ఆపదలో ఉన్నవారిని అవసరమైనపుడు, మనకు వీలైనపుడు ఆదుకోవాలని బొజ్జ గణపతి నుంచి తెలుసుకోవాలంటున్నారు మన పెద్దలు

● తల్లడిల్లకూడదని...

ఏం తిన్నా.. ఎంత తిన్నా ఇట్టే జీర్ణం చేసుకోగలనని, ఎన్ని కష్టాలొచ్చినా తనబొజ్జలో దాచుకోగలనని వినాయకుడు తన ఉదరంతో చెబుతున్నాడు. చిన్నపాటి సమస్యలకే తల్లడిల్లి పోకూడదని బొజ్జ చెబుతోంది.

● సంతోషంగా ఉండాలని...

లడ్డూలు, ఉండ్రాళ్లు గణపతికి అత్యంత ప్రీతికరం. అంటే ఎప్పుడూ సంతోషంగా ఉంటానని చెప్పకనే చెబుతున్నాడు ఆదిదేవుడు. పదిమందికి తియ్యని లడ్డూల్లాంటి సంతోషాన్ని పంచిపెట్టాలని పరోక్షంగా చెబుతున్నాడు.

● ఎలుక వాహనం..

ఎలుక... అతిచిన్న జీవిగానే మనలో చాలామంది అభిప్రాయం. పెద్దపెద్ద కార్యాలను పూర్తి చేయగల సమర్థత ఉందనే గణనాథుడు ఎలుకను వాహనంగా ఎంచుకున్నాడట. ఎవరినీ చిన్నచూపు చూడకూడదని, ప్రతి ఒక్కరిలోనూ ప్రతిభాపాటవాలు ఉంటాయని మూషిక వాహనుడు స్పష్టం చేస్తున్నాడు. అందరినీ సమానంగా చూడాలని... అలా చేస్తేనే జీవితానికి పరమార్థం ఉంటుందన్న నీతిని ఎలుక వాహనం ద్వారా వినాయకుడు సర్వమానవాళికి ఉపదేశిస్తున్నాడు.

పూజా సామగ్రి ధరలకు రెక్కలు..



శృంగవరపుకోట పట్టణంలో పూజా సామగ్రిని కొనుగోలు చేస్తున్న భక్తులు

శృంగవరపుకోట ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రెండు ఆపిల్, రెండు బత్తాయి, రెండు దానిమ్మ, ఎనిమిది నల్లద్రాక్ష, నాలుగు పచ్చద్రాక్ష పండ్లు కలిపి రూ.200. మూడు జామ పండ్లు రూ.20, మూడు మొక్కజొన్న పొత్తులు రూ.50, ఒక కొబ్బరి కాయ, డజను అరటి పండ్లు రూ.100, అరచేతిలో పట్టేంత రెండు, మూడు రకాల పత్రి రూ.50, బంతి, చామంతి పూలు, గులాబి పూలు నాలుగు చొప్పున మొత్తం రూ.50. తమలపాకులు, వక్కలు రూ.30 ...ఇలా మొత్తం రూ.500 వెచ్చిస్తే తప్ప వినాయకుడి పూజా సామగ్రి దొరకడం లేదు. శృంగవరపుకోట దేవిబొమ్మ కూడలిలో మంగళవారం పూజా సామగ్రి ధరలు హడలెత్తించాయి. ఇక పసుపు, కుంకుమ, ఉండ్రాళ్లు, పాయసానికి అవసరమయ్యే సరుకుల ధరలు వీటికి అదనం. ఉదయం నుంచి వర్షం పడుతున్నప్పటికీ లెక్క చేయకుండా పూజా సామగ్రి కొనుగోలుకు జనం బారులు తీరారు.

వినాయక ప్రతిమలతో పచ్చదనం పెరిగేలా...

భోగాపురం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మట్టి వినాయక ప్రతిమల ద్వారా పచ్చదనం పెరిగేలా ముంజేరు గ్రామానికి చెందిన నాలం వెంకట శ్రీధర్ ప్రయత్నిస్తున్నారు. అశోక మొక్కల విత్తనాలు ఉంచి వినాయక ప్రతిమలు తయారు చేస్తున్నారు. వినాయక ప్రతిమలు నీటిలో నానిన తరువాత విత్తనం మొక్కగా పెరిగి చెట్టుగా అవుతుంది. దీని ద్వారా పచ్చ దనం పెరుగుతుంది. పూజల అనంతరం చెరువులు, సముద్రాల్లో వేయకుండా బకెట్లు, జగ్గుల్లో నీరు ఉంచి... వాటిల్లో వినాయక ప్రతిమలు ఉంచాలన్నారు. ఆ తరువాత మట్టి ముద్దను గృహాలు, పొలాలు, కళ్లాల సమీపంలో గొయ్యి తీసి పూడ్చాలన్నారు. దీంతో విత్తనం మొక్కగా మారుతుందని చెబుతున్నారు. దీనిపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. ఏటా 1200 నుంచి 1400 వరకు మట్టి వినాయక ప్రతిమలను విద్యార్థులకు పంపిణీ చేస్తున్నట్టు చెబుతున్నారాయన. దీనికి తన కుటుంబ సభ్యులు నాలం అనూష, లింగం లిఖిత, లోకేష్ సహకరిస్తున్నారని శ్రీధర్ తెలిపారు.



మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్న దృశ్యం

తోటపల్లి ప్రాజెక్టులో గుర్రపు డెక్క

గరుగుబిల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టులో అధికంగా గుర్రపు డెక్క పేరుకుపోయింది. వర్షా కాలంతో పాటు వరదల సమయంలో పైప్రాంతాల నుంచి అధికంగా గుర్రపు డెక్క నాగావళి నదిలోకి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు ప్రాంతం గుర్రపు డెక్కతో పచ్చగా కనిపిస్తోంది. స్పిల్‌వేకు చెందిన ఎనిమిది షట్టర్లకు ఆనుకొని గుర్రపు డెక్క ఉండడంతో షట్టర్ల నుంచి వరద నీరు దిగువకు వెళ్లేందుకు కొంతమేర ఆటంకం కలుగుతోంది. నదిలో ఉన్న మత్స్య సంపదకు కొంతమేర ప్రమాదం ఏర్పడుతోంది. దీనిపై సంబంధిత ఏఈ బి.కిషోర్‌కుమార్‌ను సంప్రదించగా వరదల సమయంలో అధికంగా పిట్ట తామర, గుర్రపు డెక్క చేరుతున్నాయని తెలిపారు. అధికంగా వరదలు వచ్చినపుడు గేట్ల నుంచి దిగువకు మళ్లిస్తున్నట్టు తెలిపారు. గుర్రపు డెక్క నిరోధానికి ప్రత్యామ్నాయ చర్యలు లేవన్నారు.



ప్రాజెక్టులో పెరిగిన గుర్రపు డెక్క


పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం

- అర్హత కలిగిన వ్యక్తులకు కారుణ్య నియామకాలు
- ఎస్పీ వకుల్ జిందాల్


విజయనగరం క్రైం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తూ అనారోగ్యం కారణంగా, ప్రమాదవశాత్తు మరణించిన పోలీసు ఉద్యోగుల కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ మందిరంలో పోలీసు ఉద్యోగుల కుటుంబ సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. వారికి ప్రభుత్వం నుంచి రావల్సిన సర్వీసు బెనిఫిట్స్, వారి కుటుంబ సంక్షేమానికి చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. పెండింగ్‌లో ఉన్న బెనిఫిట్స్ వాటి స్థితి, ప్రగతి కుటుంబాలలో అర్హత కలిగిన వ్యక్తులకు కారుణ్య నియామకాలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి సమస్యలు, సందేహాలు ఉన్నా, సాయం కావాలన్నా తనని నేరుగా సంప్రదించవచ్చునన్నారు. హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ, మృతిచెందిన శ్రీనివాసరావు కుటుంబానికి వెల్ఫేర్ గ్రాంట్‌గా మంజూరు చేసిన రూ.15 వేల చెక్కును సతీమణి లక్ష్మికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, డీపీవో పరిపాలనా అధికారి శ్రీనివాసరావు, ఆర్ఐ గోపాలనాయుడు, కార్యాలయ సూపరింటెండెంట్‌లు రామకృష్ణ, వెంకటలక్ష్మి, అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వదలని వర్షం

- రహదారులు, పొలాలు జలమయం
- వినాయక పూజా సామగ్రి విక్రయాలకు ఇక్కట్లు



స్పిల్‌వే గేట్ల నుంచి దిగువకు విడుదల చేసిన నీరు



మద్దువలసలో...

జిల్లాలో కురుస్తున్న వర్షాలకు పంట పొలాలు నీట మునిగాయి. రహదారులు జలమయమయ్యాయి. వివిధ ప్రధాన పట్టణాలు, ప్రాంతాల్లోని వీధులు, రోడ్లపై నీరు నిలిచిపోయింది. దీంతో పాదచారులు, వాహన చోదకులు ఇక్కట్లకు గురయ్యారు. వినాయక పూజా సామగ్రి విక్రయానికి ఇబ్బందులు ఎదురయ్యాయి.

పూసపాటిరేగలో...

పూసపాటిరేగ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం వరకూ విస్తృతంగా వర్షాలు కురిశాయి. మంగళవారం మధ్యాహ్నం వరకూ 72.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షాలతో చెరువులు పూర్తిగా నిండాయి. పొలాలు కూడా నీట మునిగాయి. కొన్ని ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి. ఇప్పటివరకూ కురిసిన వర్షాలతో రైతులకు ఎటువంటి నష్టం లేకపోయినా ఇదే వర్షపాతం కొనసాగితే కొన్ని లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు చేరడంతో పాటు పంట పూర్తిగా నీట మునిగే అవకాశాలు ఉన్నాయి.

కొమరాడలో ...

పార్వతీపురం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొమరాడ మండలంలో మంగళవారం విస్తృతంగా వర్షాలు కురిశాయి. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు 8.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తర్వాత సాలూరు, పాలకొండలో ఒక మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైనట్టు అధికారులు వెల్లడించారు. జిల్లాలో మంగళవారం 10.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

నిలకడగా నాగావళి..

గరుగుబిల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదిలో వరద ప్రవాహం నిలకడగా ఉంది. మంగళవారం కురిసిన వర్షాలకు పైప్రాంతం నుంచి నదిలోకి సుమారు 4,200 క్యూసెక్కులకు పైగా వరద చేరుతోంది. దీంతో అధికారులు స్పిల్‌వే గేట్ల నుంచి దిగువకు 3,850 క్యూసెక్కుల వరదను మళ్లించారు. ప్రాజెక్టులో 105 మీటర్లకు గాను 104.14 మీటర్ల నిల్వ ఉంది. సాగునీటి అవసరాల నిమిత్తం ప్రధాన కాలువల నుంచి నీటి సరఫరాను నిలుపుదల చేశారు. ప్రస్తుతం వర్షాలు కురవడంతో సాగునీరును సరఫరా చేయలేదు. వర్షాల కారణంగా అధికంగా వరద ప్రవాహం వచ్చినట్లయితే దిగువకు మళ్లించేందుకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారు.

పెరిగిన నీటిమట్టం..

రేగిడి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఒడిశాతో పాటు మన రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో నాగావళిలో మంగళవారం నీటి ప్రవాహం పెరిగింది. సంకిలి వద్ద రెండు ఒడ్డులను తాకుతూ ప్రవహించింది. మద్దువలస, తోటపల్లి నీరు నదిలో కలుస్తుండటంతో ప్రవాహ ఉధృతి మరింత ఎక్కువ కావచ్చని లోతట్టు వాసులు అంచనా వేస్తున్నారు. వర్షాలు ఇంకా కొనసాగుతుండడంతో ముంపు భయం ఉంటుందని లోతట్టు ప్రాంతాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రిజర్వాయర్ చానల్‌కు గండి..

సీతంపేట రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏజెన్సీలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చిన్నబగ్గ సమీపంలోని నళినీకృష్ణ సాగర్ రిజర్వాయర్ చానల్‌కు గండి పడింది. భారీ వర్షాలతో రిజర్వాయర్ నుంచి వస్తున్న నీటి ఉధృతికి కాలువ గోడ కొట్టుకుపోయింది. దీంతో రిజర్వాయర్ నీరు గెడ్డలో కలిసిపోతోంది. ఈ రిజర్వాయర్ పరిధిలో సుమారు 500 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. దీనిపైనే ఆధారపడి గిరిజన రైతులు పంటలు పండిస్తున్నారు. సాగర్ నీరు వృథాగా పోతుండడంతో ఈ ప్రాంత గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగునీరు వృథాగా పోకుండా మంగళవారం గిరిజన రైతులు శ్రమదానం చేసి ఇసుక, మట్టి బస్తాలతో పాటు కర్రలను అడ్డుపెట్టి తాత్కాలికంగా ఏర్పాట్లు చేశారు. అధికారులు స్పందించి రిజర్వాయర్ హెడ్‌చానల్‌కు పడిన గండిని పూడ్చాలని చినబగ్గ, దిబ్బగూడ, మోహనకాలనీ, జరడకాలనీ గ్రామాలకు చెందిన కృష్ణ, సుధ, రామారావు తదితర రైతులు కోరుతున్నారు.

మద్దువలసకు జలకళ..

- రెండు గేట్ల ద్వారా నీరు విడుదల

వంగర, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో నాగావళి, వేగావతి, సువర్ణముఖి నదుల్లో జల ప్రవాహం పెరిగింది. దీంతో మద్దువలస రిజర్వాయర్‌లో నీటి మట్టం ఒక్కసారిగా పెరిగింది. మంగళవారం ఉదయం వరకు 64.35 మీటర్లు ఉన్న నీటి మట్టం ఒక్కసారిగా 64.72 మీటర్లకు చేరింది. దీంతో అప్రమత్తమైన అధికారులు రెండు ప్రధాన గేట్ల ద్వారా 3,558 క్యూసెక్కుల నీటిని బయటకు విడిచి పెట్టారు. ఇన్‌ఫ్లో 2,068 క్యూసెక్కులు రాగా... వర్షాల నేపథ్యంలో అదనపు నీటిని దిగువకు విడిచి పెడుతున్నట్లు ఏఈ నితీష్ కుమార్ తెలిపారు. కుడి, ఎడమ కాలువల ద్వారా పంట భూముల కు 710 క్యూసెక్కుల నీటిని విడిచి పెడుతున్నట్లు వివరించారు. చేపల వేటకు నిషేధం విధించినట్టు ఆయన చెప్పారు.



ముత్యాలమ్మతల్లి

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ

భోగాపురం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): గుడివాడ పంచాయతీలో గల ముత్యాలమ్మ, తోగలమ్మ అమ్మవార్లను మంగళవారం భక్తులు పుష్పాలు, తులసి పత్రాలతో అలంకరించారు. ముత్యాలమ్మ అమ్మవారిని తులసి పత్రాలు, తోగాలమ్మ అమ్మవారిని పుష్పాలతో సుందరంగా అలంకరించారు. గుడివాడ, చుట్టుపక్కల గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవార్లను దర్శించుకొని.. మొక్కుబడులు చెల్లించుకున్నారు.

నవరాత్రి ఉత్సవాలకు ఉచిత విద్యుత్తు

విజయనగరం, రింగురోడ్డు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి, దేవీ నవరాత్రుల ఉత్సవాలకు ఉచిత విద్యుత్తు అందిస్తు న్నట్టు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. గణేష్ నవరాత్రి ఉత్సవాలు, దేవీ నవరాత్రుల్లో భాగంగా ఏర్పాటు చేస్తున్న మండపాలకు ఉచిత విద్యుత్తు అందిస్తున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ సూపరిం టెండెంట్ ఇంజినీరు లక్ష్మణరావు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు 3కే వాట్స్, పట్టణాలకు 5కే వాట్స్ వరకు ఉచిత లోడ్‌ను మంజూరు చేయనున్నట్టు చెప్పారు. 5 కిలోవాట్స్ పైబడి మాత్రమే నిర్ణీత రుసుంను చెల్లించాలన్నారు. మండల, ఉత్సవ నిర్వాహకులు విద్యుత్తు సిబ్బందిని సంప్రదించాలన్నారు. విద్యుత్తు సరఫరా ముందు భద్రతా చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని సూచించారు.



సంకిలి వద్ద నాగావళిలో నీటి ప్రవాహం



ఎరుకొండ వద్ద రహదారిపై నుంచి ప్రవహిస్తున్న నీరు



నడిపల్లి వద్ద నీట మునిగిన వరి



వృథాగా పోతున్న రిజర్వాయర్ నీరు



శ్రమదానంతో గండిని పూడ్చుతున్న రైతులు

రేపు పైడితల్లి ఆలయ హుండీల లెక్కింపు

రాజాం/ రూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారికి భక్తులు సమర్పించిన ముడుపులు, కానుకలకు సంబంధించిన హుండీలను ఈనెల 28న ఉదయం 10 గంటలకు తెరిచి లెక్కించనున్నట్టు దేవస్థానం ఈవో బీవీ మాధవరావు తెలిపారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఇతర సిబ్బంది సమక్షంలో హుండీలను తెరవనున్నట్టు ఆయన వెల్లడించారు. ఆసక్తి ఉన్నవారు హాజరు కావాలని ఆయన కోరారు.

అక్రమ కట్టడం తొలగింపు

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని 39వ డివిజన్‌లో శాలీపేటలో ఉన్న అక్రమ కట్టడాన్ని నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య ఆదేశాలతో అధికారులు మంగళవారం కూల్చేశారు. ఈ విషయంపై ప్రణాళిక సిబ్బంది మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో అనధికారిక షెడ్డు ఉందని, దీనిపై వచ్చిన ఫిర్యాదులు మేరకు తొలగించామని చెప్పారు.

మందుగుండు సామగ్రి స్వాధీనం

జామి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలమండ గ్రామంలో అక్రమంగా నిల్వచేసిన మందుగుండు సామగ్రిని పట్టుకుని దాసరి దేముడు అనే వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ వీరజనార్ధన్ తెలిపారు. మంగళవారం అలమండ గ్రామంలో నాటు తుపాకుల కోసం కార్డన్ సెర్చ్ నిర్వహించామని చెప్పారు. ఈ తనిఖీల్లో మందుగుండు సామగ్రి గుర్తించి, స్వాధీనం చేసుకున్నామని, వాటిని నిల్వ ఉంచిన వ్యక్తిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

విశాఖ సమావేశానికి హాజరైన ఎస్.కోట ఎమ్మెల్యే

శృంగవరపుకోట, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): విశాఖపట్టణంలో మంగళవారం నిర్వహించిన టీడీపీ పార్లమెంటరీ కమిటీ సమావేశానికి ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి హాజరయ్యారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ ఎం.శ్రీభరత్ ఇతర పార్లమెంటరీ కమిటీ నాయకులతో కలిసి వివిధ అంశాలపై మాట్లాడినట్టు ఎమ్మెల్యే తెలిపారు.

నానో యూరియా వినియోగించండి



డ్రోన్‌తో నానో యూరియా పిచికారీకి సిద్ధం చేస్తున్న దృశ్యం

రేగిడి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): నానో యూరియా పర్యావరణ హితమైనదని, దీనిని రైతులు విరివిగా వినియోగించాలని ఏవో బి.శ్రీనివాసరావు రైతులకు సూచించారు. మంగళవారం అంబాడ గ్రామంలో డ్రోన్‌తో నానో యూరియా పిచికారీపై రైతులకు అవగాహన కల్పించారు. అర లీటరు నానో యూరియా 45 కిలోల యూరియాతో సమానం అని, దీనిని గమనించి రైతులు ఈ దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు.

పశు పోషణపై ప్రత్యేక దృష్టి సారించాలి

వేపాడ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వర్షాలు విస్తారంగా కురుస్తున్నందున రైతులు పశు పోషణపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల పశువైద్యాధికారి కోరాడ గాయత్రీ అన్నారు. వేపాడలో మంగళవారం ఆమె పాడి రైతులకు అవగాహన కల్పించారు. పశువులను మేత కోసం వరద ప్రభావిత ప్రాంతాలకు తీసుకువెళ్లవద్దని సూచించారు. ఉరుములు, మెరుపులు వచ్చేటప్పుడు పశువులను చెట్ల కింద ఉంచవద్దని, షెడ్లలో ఉంచాలన్నారు.

రెచ్చిపోతున్న చిల్లర దొంగలు

ఎస్.కోట రూరల్, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో చిల్లర దొంగలు రెచ్చిపోతున్నారు. ముఖ్యంగా ఇళ్ల బయట ఉంచిన ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు, ఆటోల బ్యాటరీలను దొంగిలిస్తున్నారు. పెట్రోలు తీసేస్తున్నారు. సోమవారం రాత్రి సంత గైరమ్మపేటలో భార్గవ్ అనే యువకుడు తన ఇంటి బయట పెట్టిన ద్విచక్ర వాహనం రెండు చక్రాలను ఎత్తుకుపోయారు. పోలీసులు రాత్రి పూట గస్తీ పెంచి దొంగతనాలను అరికట్టాలని మండలవాసులు కోరుతున్నారు.

చినుకు పడితే బురదే..

గజపతినగరం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): లోగిస గ్రామం నుంచి ముచ్చర్లకు వెళ్లే మట్టి రోడ్డు చినుకు పడితే బురదమయంగా మారుతోంది. దీంతో గ్రామస్థులు రాక పోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. లోగిస గ్రామంలో గల సమీకృత బాలుర వసతిగృహంలో వంద మంది విద్యార్థులు ఉన్నారు. వీరు ప్రతిరోజూ వసతిగృహం నుంచి లోగిస గ్రామంలోగల పాఠశాలకు రాకపోకలు సాగిస్తుంటారు. మట్టిరోడ్డు బురద మయం కావడంతో వీరు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు.



లోగిస నుంచి ముచ్చర్లకు వెళ్లే మట్టి రోడ్డు

మట్టి గణపతి విగ్రహాలనే పూజిద్దాం

వినాయక చవితి సందర్భంగా మట్టి గణపతి విగ్రహాలనే పూజించండి.. పర్యావరణాన్ని పరిరక్షించండి అని పలువురు దాతలు పిలుపునిచ్చారు. మంగళవారం విజయనగరం జిల్లాలోని పలుచోట్ల దాతలు ముందుకు వచ్చి, మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలతో పర్యావరణానికి హాని కలుగుతుందని తెలిపారు.
(ఆంధ్రజ్యోతి బృందం)



గరివిడి: మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు



కొత్తవలస: ప్రతిమలు పంపిణీ చేస్తున్న శేఖర్ మెడికల్స్ అధినేత చంద్రశేఖరరెడ్డి



ఎస్.కోట రూరల్: పోతనాపల్లిలో సీతంపేట వాసవీక్లబ్ ఆధ్వర్యంలో..



విజయనగరం రూరల్: కొత్తపేటలో..



ఎస్.కోట: జియో సంస్థలో ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న దృశ్యం



రాజాం: మట్టి వినాయక విగ్రహాలను అందజేస్తున్న రూరల్ సీఐ ఉపేంద్ర



గుర్ల: నవభారత యువజన సంఘం ఆధ్వర్యంలో..

విద్యార్థులకు మట్టి విగ్రహాల తయారీ పోటీలు

నెల్లిమర్ల, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): జరజాపుపేట ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు మట్టితో గణపతి విగ్రహాల తయారీ పోటీలను నిర్వహించారు. హెచ్ఎం కామేశ్వరి ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. విజేతలకు గణిత ఉపాధ్యాయుడు శివకు బంగారయ్య ఆర్థిక సహకారం అందించారు.

సంగీత కళాశాలలో వినాయక నవరాత్రి ఉత్సవాలు

విజయనగరం బాబామెట్ట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ మహారాజా సంగీత కళాశాలలో ఈనెల 27 నుంచి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నామని, ఈ సందర్భంగా సంగీత నృత్య మహోత్సవాలు ఏర్పాటుచేస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డా.మండపాక నాగలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం నుంచి సెప్టెంబరు 6 వరకూ ప్రతిరోజూ సాయంత్రం 5 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఉదయం 11 గంటలకు గణపతి పూజలు నిర్వహిస్తామన్నారు.

మహిళలకు సముచిత స్థానం కల్పించాలి

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళలకు సముచిత స్థానం కల్పించాలని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షురాలు పలుకూరి ప్రభావతి అన్నారు. మంగళవారం విజయనగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సభలో ఆమె మాట్లాడారు. ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షురాలిగా అవకాశం కల్పించిన మాజీ రాజ్యసభ సభ్యుడు, గ్లోబర్ చైర్మన్ టీజీ వెంకటేష్, అధ్యక్షుడు టంగుటూరి రామకృష్ణ, మహిళ విభాగం అధ్యక్షురాలు విజయలక్ష్మికి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటంతో పాటు మహిళ హక్కులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

పీహెచ్‌సీ అభివృద్ధికి సహకరించండి

లక్కవరపుకోట, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక పీహెచ్‌సీ అభివృద్ధికి అందరూ సహకరించాలని ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు కోరారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో వైద్యుడు అనీల్‌కుమార్ ఆసుపత్రి సమస్యలను కమిటీకి వివరించారు. పారిశుధ్యం, ఎలక్ట్రికల్ వర్క్స్, తాగునీటి సమస్యలు ఉన్నాయని తెలిపారు. ఆసుపత్రిలో సామగ్రి కొరత ఉందన్నారు. దీనిపై ఎంపీపీ స్పందిస్తూ హెచ్‌డీఎస్ నిధులు ఖర్చుచేసి అభివృద్ధి చేయాలని, రోగులకు మెరుగైన సేవలు అందించాలని కమిటీకి సూచించారు. ఎంపీడీవో అప్పారావు, వైద్యులు ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

భోగాపురం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతంలో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి ఎంపీడీవో కె.గాయత్రీ. పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆమె ముక్కాం, కొండ్రాజుపాలెం, చేపలకంచేరు గ్రామాల్లో పర్యటించారు. సముద్ర తీరాన్ని సందర్శించారు. వర్షాలు కురుస్తున్న కారణంగా సిబ్బంది గ్రామాల్లో అందుబాటులో ఉండాలన్నారు. కార్యదర్శులు ఎస్.మదీనావల్లి, అబ్దుల్‌సత్తార్ తదితరులు పాల్గొన్నారు. ● జామి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండలంలో కురుస్తున్న వర్షాలపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కృష్ణంరాజు ఆదేశించారు. మంగళవారం రాత్రి మండలంలోని భీమసింగి ప్రాతంలో ఉన్న గోస్తనీ నది ప్రవాహంతోపాటు గెడ్డలను పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. రెవెన్యూ సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి.. పరిస్థితి ఎప్పటికప్పుడు నివేదించాలన్నారు.



భోగాపురం: ముక్కాం తీరాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో గాయత్రీ

రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు

బొండపల్లి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండల సముదాయం సమీపాన రోడ్డుకు అడ్డంగా చెట్టు పడింది. కనిమెరక, దేవుపల్లి తదితర గ్రామాలకు వెళ్లే రహదారిలో ఈ చెట్టు పడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు, ఎస్ఐ యు.మహేష్. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

మదర్ థెరిసా సేవలు వెలకట్టలేనివి: ఎస్పీ

విజయనగరం క్రైం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మదర్ థెరిసా సేవలు వెలకట్టలేనివని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. నగరంలోని సీటీ కాలనీలో థెరిస్సా క్లబ్ ఆధ్వర్యంలో మదర్‌థెరిస్సా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై థెరిస్సా విగ్రహానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. ఈసందర్భంగా థెరిస్సా క్లబ్‌లో టైలరింగ్ నేర్చుకున్న మహిళలకు ఆయన ప్రశంసా పత్రాలను అందజేశారు. సంస్థ ప్రతినిధులు కృష్ణమూర్తి, బోస్ తదితరులు పాల్గొన్నారు. ● రాజాం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మదర్ థెరిసా జయంతిని రాజాం పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాజాం రెడ్‌క్రాస్ చైర్మన్ కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్యకుమార్, మోటివేషనల్ స్పీకర్ బూరాడ శివకృష్ణ, హెచ్ఎం ఎస్.విజయలక్ష్మి ఆధ్వర్యంలో థెరిసా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మదర్ థెరిసా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

గ్రామాల్లో కార్డన్ సెర్చ్

లక్కవరపుకోట, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనమసివానిపాలెం, కొంపల్లి, భీమాలి, నర్సంపేట గ్రామాల్లో ఎస్ఐ నవీన్‌పడాల్ ఆధ్వర్యంలో మంగళవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఎటువంటి నాటుతుపాకులు, మందుగుండు సామగ్రి లభించలేదని ఎస్ఐ తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

కొత్తవలస, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): కంటకాపల్లి పంచాయతీ, కొత్త సుంకరపాలెం గ్రామ సమీపంలోని కొత్తవలస-విజయనగరం రోడ్డు పక్కనున్న చెరువులో మంగళవారం ఉదయం గుర్తుతెలియని మృతదేహం తేలియాడింది. గ్రామస్థులు ఇచ్చిన సమాచారం మేరకు కొత్తవలస సీఐ షణ్ముఖరావు సిబ్బందితో వెళ్లి, పరిశీలించారు. మృతదేహాన్ని బయటకు తీయడానికి ఎవరూ సాహసించలేదు. చివరకు ఏఎస్ఐ జనార్దన్ సాహసించి చెరువులోకి దిగి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుని వయస్సు సుమారు 53ఏళ్లు ఉండవచ్చని భావిస్తున్నారు. వీఆర్వో రామానుజం ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ షణ్ముఖరావు కేసు నమోదు చేసి.. దర్యాప్తు నిమిత్తం ఎస్ఐ ప్రసాదరావుకు అప్పగించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోట తరలించారు. అయితే ఆదివారం మధ్యాహ్నం ముగ్గురు వ్యక్తులు ఆటోలో ఇక్కడకు వచ్చారని, అందులో ఒక వ్యక్తి కలువ పూలు కోయడానికి చెరువులో దిగగా.. పూల తీగెలు చుట్టేయడంతో బయటకు రాలేక మునిగిపోయి ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. వీరు విశాఖపట్టణం నుంచి వచ్చినట్టు తెలుస్తోంది.

హైవేపై కారు బోల్తా

● ఒకరి పరిస్థితి విషమం.. మరో ముగ్గురికి తీవ్ర గాయాలు



బోల్తా పడిన కారును పరిశీలిస్తున్న సీఐ దుర్గాప్రసాద్‌రావు

భోగాపురం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని భోగాపురం ఆదర్శ పాఠశాల సమీప జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు అందించిన సమాచారం ప్రకారం.. విశాఖ జిల్లా కొమ్మాది గ్రామానికి చెందిన పి.రాజేశ్వరి, బి.సంజీవరావు అనే భార్యభర్తలు, లక్ష్మి, మోహిత అనే తల్లీకూతుర్లు కారులో విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం జిల్లా బూర్జ శుభకార్యానికి వెళ్తున్నారు. భోగాపురం ఆదర్శ పాఠశాల సమీపంలోని జాతీయ రహదారిపై వచ్చేసరికి వర్షపునీరు కారణంగా ప్రమాదవశాత్తు కారు అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో రాజేశ్వరికి నుదిటిపై తీవ్ర గాయాలు కాగా, మిగతా ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి 108కి సమాచారం అందించి, క్షతగాత్రులను తగరపువలస ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. రాజేశ్వరి పరిస్థితి విషమంగా ఉంది. సమాచారం తెలుసుకున్న సీఐ దుర్గాప్రసాద్‌రావు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు. దీనిపై సీఐ మాట్లాడుతూ ఈ ఘటనపై ఇంకా కేసు నమోదు కాలేదని చెప్పారు.

గంజాయి స్వాధీనం

● పోలీసుల అదుపులో నలుగురు

సంతకవిటి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పొనుగుటివలస జంక్షన్ వద్ద స్థానిక పోలీసులు గంజాయి ముఠాను పట్టుకున్నారు. స్థానిక ప్రైవేటు కళాశాల ఎదురుగా ఉన్న మామిడితోటలో 4.8 కిలోల గంజాయి సరఫరా చేస్తున్న నలుగురు వ్యక్తులను గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. నిందితులు పాలకొండ ప్రాంతానికి చెందిన బి.దుర్గాప్రసాద్, షేక్ రఫీ, కె.ఉదయ్, ఎ.చంద్రశేఖర్‌లుగా పోలీసులు తెలిపారు. సోమవారం సాయంత్రం అరెస్టు చేసిన పోలీసులు.. మంగళవారం రిమాండ్ నిమిత్తం పాలకొండ కోర్టుకు తరలించారు.

సాలూరులో..

సాలూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓల్డ్ బీఎస్ఎన్ఎల్ ఆఫీసు రోడ్డులో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తుల నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బి.అప్పలనాయుడు తెలిపారు. మంగళవారం సాలూరులో విలేకరులతో మాట్లాడుతూ ఓల్డ్ బీఎస్ఎన్ఎల్ ఆఫీసు రోడ్డులో అనుమానాస్పదంగా ఇద్దరు వ్యక్తులు సంచరిస్తున్నట్లు సమాచారం వచ్చిందని తెలిపారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా తెలంగాణ, ఒడిశా రాష్ట్రాలకు చెందిన వారిగా గుర్తించినట్లు చెప్పారు. వారి వద్ద ఉన్న బ్యాగుల్లో 5.60 కేజీల గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయని, మల్కనగిరి నుంచి తెలంగాణకు గంజాయిని తరలిస్తున్నట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

విజయనగరం రూరల్ సీఐపై ఎఫ్ఐఆర్

విజయనగరం క్రైం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): విజయనగరం రూరల్ సీఐగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మణరావుపై జామి పోలీసుస్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదయ్యింది. 2019లో జామి ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సమయంలో భూమి విషయంలో న్యాయం జరగలేదని ఒక బాధితుడు కోర్టులో ప్రైవేటు కేసు వేశారు. దీంతో న్యాయాధికారి కేసు నమోదు చేయాల్సిందిగా పోలీసు అధికారులను ఆదేశించారు. దీంతో జామి ఎస్ఐ వై.వీరజనార్ధన్.. సీఐ లక్ష్మణరావుపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. దీనిపై విచారణ జరుగుతుందన్నారు.

ఆటో డ్రైవర్లకు ఉపాధి కల్పించాలి

● రేపు బంద్‌కు పిలుపునిచ్చిన యూనియన్ నాయకులు

కొత్తవలస, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయంగా ఉపాధి అవకాశాలు కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తవలస జంక్షన్‌లోని అన్ని కూడళ్లకు చెందిన ఆటో డ్రైవర్లు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సురేష్ మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిన తర్వాత ఆటోడ్రైవర్ల పరిస్థితి మరీ దారుణంగా మారిందన్నారు. ప్రతి ఆటో డ్రైవర్ బ్యాంకు అకౌంట్‌లో రూ.25వేలు జమ చేయాలని డిమాండ్ చేశారు. ప్రత్యేకంగా సంక్షేమ నిధి బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు గాడి అప్పారావుతోపాటు ఆటో కార్మిక సంఘం నాయకుడు కడుపట్ల అప్పారావు, పాత్రుడు పాల్గొన్నారు. ● రాజాం/ రూరల్: ఆటో కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఉపాధి చూపించాలని కోరుతూ ఈనెల 28న నిర్వహించనున్న బంద్‌ను ప్రతిఒక్కరూ జయప్రదం చేయాలని ఆటో వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు రామ్మూర్తి నాయుడు, అధ్యక్షుడు కోటి పిలుపునిచ్చారు. ఈమేరకు రాజాంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారిద్దరూ వేర్వేరుగా మాట్లాడారు. ప్రతిఒక్కరూ బంద్‌ను జయప్రదం చేయాలని వారు కోరారు.



కొత్తవలస: వర్షంలో నిరసన ర్యాలీ చేస్తున్న ఆటో డ్రైవర్లు

జిందాల్‌కు కలెక్టర్ మద్దతు బాధాకరం

● 66వ రోజుకు నిర్వాసితుల నిరసన
● ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన

ఎస్.కోట రూరల్, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): బొడ్డవర ప్రాంతంలో 18 ఏళ్ల కిందట జిందాల్ కంపెనీ ఏర్పాటు పేరుతో తమ భవిష్యత్తును నాశనం చేసిన యాజమాన్యానికి కలెక్టర్ మద్దతు పలకడం బాధాకరమని నిర్వాసితులు అన్నారు. మంగళవారం 66వ రోజు వారు బొడ్డవర గ్రామంలో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు చల్లా జగన్ మాట్లాడుతూ ఇన్ని రోజులుగా నిరసన చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు.

భూములిచ్చిన రైతులను ముంచింది

భూములిచ్చిన రైతులను జిందాల్ యాజమాన్యం నిట్టనిలువున ముంచేసిందని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. జిందాల్ నిర్వాసితులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ 66 రోజులుగా నిరసన చేస్తున్నా ఇక్కడి ప్రజాప్రతినిధులు, అధికారులకు పట్టడం లేదని.. అందుకే ఈనెలలో చలో జంతర్‌మంతర్ కార్యక్రమానికి రైతులు పూనుకున్నారని చెప్పారు. వారికి న్యాయం జరిగే వరకు వారి వెంట ఉంటానని ఆయన స్పష్టం చేశారు. జిందాల్ ఎంత మోసానికి పాల్పడిందని 2006-07 గ్రామసభల ద్వారా చేసిన తీర్మానాలు బయటపెడితే తెలుస్తుందన్నారు.



నిరసన చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

గరివిడి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): గరివిడి పట్టణంలోని ఎరువుల దుకాణాలను అధికారుల బృందం మంగళవారం తనిఖీ చేసింది. గర్భాం రోడ్డులో ఉన్న శ్రీరాధాకృష్ణ ట్రేడర్స్‌లో యూరియాను అధిక ధరకు విక్రయిస్తున్నట్టు గుర్తించారు. దీంతో 15 రోజులపాటు షాపును మూసివేసి, అమ్మకాలు నిలిపివేయాలని ఆదేశించారు. మండల ప్రత్యేకాధికారి ఎన్.దామోదరరావు, తహసీల్దార్ బంగార్రాజు, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, గరివిడి ఎస్ఐ లోకేశ్వరరావు పాల్గొన్నారు.

డెంకాడ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ద్రవరూప ఎరువులపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి చంద్రశేఖరావు సూచించారు. మండలంలోని మోపాడ సత్తిరాజు ఎంటర్‌ప్రైజస్, డెంకాడ సాయి కృష్ణ రైతుమిత్ర గ్రూపు ఎరువుల దుకాణాలలో, డెంకాడ పీఏసీఎస్‌లో చంద్రశేఖరరావుతో పాటు తహసీల్దార్ రాజారావు, వ్యవసాయాధికారి సంగీత మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఎరువుల నిల్వలను, స్టాక్ బోర్డులను, రికార్డులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఎరువులను ఎంఆర్‌పీ కంటే అధిక ధరకు విక్రయించినా, కృత్రిమ కొరత సృష్టించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, లైసెన్స్‌లు రద్దుచేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రామకోటి, వీఏఏ లెనిన్ తదితరులు పాల్గొన్నారు. ● రేగిడి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఎరువుల కృత్రిమ కొరత సృష్టించిన వారిపై 6ఏ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ కృష్ణలత, ఏవో శ్రీనివాసరావు.. ఎరువుల షాపుల నిర్వాహకులను హెచ్చరించారు. మండలంలోని ఉంగరాడమెట్ట, ఉణుకూరులో ఉన్న ఎరువుల దుకాణాలను మంగళవారం వారు ఎస్ఐ నీలావతితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో సీఎస్‌డీటీ రామారావు, ఏఈవో విజయలక్ష్మి ఉన్నారు.



డెంకాడ: రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా ఉద్యానవన శాఖాధికారి చంద్రశేఖరరావు



రేగిడి: ఉణుకూరులో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

ఎస్.కోటలో 6ఏ కేసు నమోదు

శృంగవరపుకోట, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జేకే అగ్రి ఇండియా ట్రేడర్స్ (ఎరువుల దుకాణం)పై 6ఏ కేసు నమోదు చేసినట్టు ఏవో రవీంద్ర తెలిపారు. మంగళవారం ఈ ఎరువుల దుకాణంతో పాటు మన గ్రోమోర్ ఎరువుల దుకాణాన్ని శ్రీకాకుళం ప్రాంతీయ నిఘా అమలు అధికారి బి.ప్రసాద్, వ్యవసాయ సహాయ సంచాలకురాలు భానులత, విజిలెన్స్ సీఐ బి.సింహాచలం తనిఖీ చేశారు. జేకే అగ్రి ఇండియాలో ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్, ఇ-పాస్ మెషన్‌లో డీబీటీ తనిఖీలు చేయడంతో అవకతవకలు జరిగినట్టు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

అవాస్తవ కథనాల ప్రసారం సరికాదు

● టీవీ చానళ్లపై ఎస్టీ కమిషన్లకు ఫిర్యాదు చేస్తా : మంత్రి సంధ్యారాణి


సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు,ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): తనపైన, తన కుటుంబ సభ్యులపైనా అవాస్తవ కథనాలు ప్రసారంచేస్తే సహించేది లేదని, సంబంధిత టీవీ చానళ్లపై కేసులు పెడతానని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ప్రస్తుతం ఎలాంటి ఆధారాలు లేకుండా అవాస్తవాలతో తనపై, తన కుమారుడిపై తప్పుడు కథనాలను ప్రసారంచేయడం సరికాదని పేర్కొన్నారు. మంగళవారం సాలూరులో విలేకరులతో మాట్లాడుతూ గిరిజన సంక్షేమశాఖలో ఇంజనీరింగ్ ఇన్ చీఫ్‌గా పనిచేస్తున్న ఎస్.శ్రీనివాసరావు లంచం తీసుకొని ఏసీబీకి పట్టుబడితే తనకు సంబంధం ఉందని రెండు టీవీ చానళ్లు అవాస్తవ కథనాలు ప్రచారంచేయడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు.ఆ చానళ్లపై రాష్ట్ర, జాతీయ ఎస్టీ కమిషన్లకు ఫిర్యాదు చేస్తానని చెప్పారు. సమావేశంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, ఏఎంసీ చైర్మన్ ముఖీ సూర్యనారాయణ, కేతిరెడ్డి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయిస్తాం

మంత్రి గుమ్మిడి సంధ్యారాణిపై తప్పుడు ప్రచారం చేసిన చానళ్లపై కేసు పెట్టడమే కాకుండా రాష్ట్ర, జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని ఎస్టీ సంఘం న్యాయ సలహాదారు కోట్ల లక్ష్మణ తెలిపారు. సాలూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నడూలేని విధంగా అభివృద్ధి, సంక్షేమం చేస్తున్న సంధ్యారాణిపై కక్షకట్టి ఓర్వలేక అసత్య ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ ఆనంద్ పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎం సహాయనిధి

సాలూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి):పేదలకు సీఎం సహాయ నిధి అండగా నిలుస్తోందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. మంగళవారం సాలూరులో సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.2,25,462 మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

ఎదుగుదలను అడ్డుకోలేరు

మక్కువ రూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మంత్రి సంధ్యారాణిపై తప్పుడు ప్రచారం చేస్తే ఉపేక్షించేదిలేదని ఏపీ ఆదివాసీ ట్రైబల్ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి మండల గిరిధర్ హెచ్చరించారు.మంగళవారం దుగ్గేరులో గిరిజన యువకులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అసత్య ప్రచారం చేసినంత మాత్రాన మంత్రి సంధ్యారాణి ఎదుగుదలను అడ్డుకోలేరని చెప్పారు.

స్టేషన్లల్లో మౌలిక వసతులు కల్పించండి: ఎమ్మెల్యే

బెలగాం/పార్వతీపురం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌ల్లో మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర కోరారు. మంగళవారం విశాఖపట్నంలో డీఐజీ గోపినాథ్ జెట్టిని ఎమ్మెల్యే విజయచంద్ర కలిశారు. పోలీసుల సమస్యలు డీఐజీ దృష్టికి తీసుకెళ్లారు. పార్వతీపురంలోని పోలీస్ స్టేషన్‌ను అభివృద్ధి చేసి ఆధునిక వసతులు కల్పించాలని కోరారు.


గోపినాథ్ జెట్టితో మాట్లాడుతున్న విజయచంద్ర

సీసీ రోడ్లు మంజూరుచేయాలి

పాలకొండ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):నియోజకవర్గంలో ఉపాధి హామీ పథకం ద్వారా సీసీ రోడ్లు, బీటీ రోడ్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కోరారు. పార్వతీపురం కలెక్టర్ శ్యాంప్రసాద్‌ను కలిశారు.

గణేష్ నవరాత్రులు ప్రశాంతంగా జరగాలి

పాలకొండ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గణేష్ నవరాత్రులు ప్రశాంతంగా జరగాలని పాలకొండ సబ్ కలెక్టర్ స్వప్నిల్ జగన్నాథ్ కోరారు. మంగళవారం పాలకొండ సబ్‌కలెక్టరేట్‌లో పోలీస్, అగ్నిమాపక, రెవెన్యూ, ట్రాన్స్‌కో అధికారులతో సమావేశం నిర్వహించారు.సమావేశంలో డీఎస్పీ ఎం.రాంబాబు, సీఐ చంద్రమౌళి, సర్వేశ్వరరావు, తహసీల్దార్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీలదే బాధ్యత

జియ్యమ్మవలస, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలు నిబంధనల ప్రకారం ప్రశాంత వాతావరణంలో జరగాలని, ఎటువంటి సమస్య తలెత్తినా ఉత్సవ కమిటీలదే బాధ్యత అని జియ్యమ్మవలస పోలీస్ స్టేషన్ సబ్‌ఇన్‌స్పెక్టర్ ఎన్.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. మంగళవారం పెదబుడ్డిడిలో గణేష్ ఉత్సవాల నిర్వాహకులతో మాట్లాడారు.

పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించండి

పార్వతీపురంటౌన్, ఆగష్టు 26 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆర్‌డీఎంఏ రవీంద్రనాథ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో ఇన్‌చార్జి కమిషనర్ శ్రీనివాసరాజుతో పాటు సంబంధిత విభాగాల అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలు కురుస్తుండడంతో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజారోగ్యశాఖ అధికారులను కోరారు. ఇంటింటి చెత్తలు, వ్యర్థాలు సేకరణతోపాటు పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇంటి,కుళాయి పన్నుల వసూళ్లపై రెవెన్యూ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. తాగునీటి సరఫరాకు ఇంజనీరింగ్ విభాగం అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కోరారు.

ఎరువుల పంపిణీ ప్రకటనలకే పరిమితం

సీతానగరం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతుల డిమాండ్‌ను బట్టి సమకూర్చకపోవడంతో ఎరువుల కోసం రైతులు వ్యవసాయ పనులు విడిచిపెట్టి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని సీపీఎం జిల్లా నాయకుడు రెడ్డి వేణు ఆరోపించారు. ఎరువులు పంపిణీ ప్రకటనలకే పరిమితమయ్యిందనివిమర్శించారు.మంగళవారం సీతానగరంలో విలేకరులతో మాట్లాడారు.రైతులకు ఎరువులు పంపిణీ చేయకపోతే ఉద్యమించక తప్పదని హెచ్చరించారు.

వాలీబాల్‌లో చాంపియన్‌షిప్ సాధించిన మన్యం

పాలకొండ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మన్యం జిల్లా వాలీబాల్ జట్టు రాష్ట్రస్థాయిలో పోటీల్లో సత్తాచాటింది. తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో మన్యంజిల్లా జట్టు చాంపియన్‌షిప్ సాధించింది. ఈ మేరకు పాలకొండకు చెందిన యామల అభిషేక్ అన్ని విభాగాల్లో రాణించి సత్తాచాటడంతో తండ్రి ఈశ్వరరావు, కుటుంబ సభ్యులతోపాటు వాలీబాల్ స్టేట్ కోఆర్డినేటర్ ఎన్.జాకబ్ దయానందం అభినందించారు.

యూరియాకోసం బారులు తీరిన రైతులు

సాలూరు రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మామిడిపల్లిలో యూరియా కోసం మంగళవారం రైతులు బారులు తీరారు. ఇక్కడి రైతు సేవా కేంద్రానికి 235 బస్తాల యూరియా వచ్చినట్లు తెలియడంతో రైతులు తరలివచ్చారు. వారికి టోకెన్లు ఇచ్చి యూరియా పంపిణీచేశారు. క్యూలో నిలబడిన కొందరికి అందకపోవడంతో వారు గ్రామసచివాలయ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. కాగా మామిడిపల్లిలో ప్రైవేట్ ఎరువుల దుకాణాల్లో రూ. నాలుగు లక్షల విలువైన ఎరువులకు స్టాప్ సేల్ ఇచ్చామని సాలూరు ఏవో కె.శిరీష చెప్పారు. ఇక్కడి రెండు ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ సీఐ రవిప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు.

మహిళలకు ఓటు హక్కుపై అవగాహన

పాలకొండ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్‌మెంట సెల్ ఆధ్వర్యంలో నేషనల్ ఉమెన్ ఈక్వాలిటీడే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ బి.జయమణి యునైటెడ్ స్టేట్స్‌లో మహిళలకు ఓటు హక్కు కల్పించిన రాజ్యాంగ సవరణ 19వ ఆర్టికల్‌పై అవగాన కల్పించారు.


వంతెనపై గుంతలు ఏర్పడిన దృశ్యం

మరమ్మతులు లేక.. గుంతలు పూడ్చక

● ఇదీ గోముఖి నది వంతెన పరిస్థితి

మక్కువ రూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోన, దబ్బగెడ్డ గ్రామాల మధ్యలో గోముఖీనదిపై నిర్మించిన వంతెన కనీస మరమ్మతులకు నోచుకోడంలేదు. ఇక్కడ గుంతలు పూడ్చకపోవడంతో ఇరువైపులా ప్రమాదకరంగా మారింది. కోన గ్రామం నుంచి దబ్బగెడ్డ, దబ్బగెడ్డ నుంచి కోన గ్రామానికి వచ్చేమార్గంలో రెండు గుంతలు దాటిల్సిఉంటుంది. అయితే రెండుచోట్ల చివరిభాగంలో పెద్దగుంతలు ఏర్పడి నీరునిల్వ ఉంటోంది. దీంతో గుంతల్లో పడి ఎప్పుడు ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో 2004లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంహయాంలో వంతెన నిర్మించారు. అప్పటి నుంచి వంతెనకు ఎటువంటి మరమ్మతులు చేపట్టలేదు.ఈనేపథ్యంలో కురుస్తున్న వర్షాలకు వంతెనకు చివరిభాగంలో రెండువైపులా ఏర్పడిన గుంతలు ప్రమాదాలకు నిలయంగా మారాయి. కోన,దబ్బగెడ్డ గ్రామలతోపాటు డి.శిర్లాం, పార్వతీపురం మండలంలోని డీకేపట్నం పంచాయతీలోని 15 గ్రామాల ప్రజలు ఈ వంతెనపై నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. తక్షణమే అధికారులు దబ్బగెడ్డ వంతెనను పరిశీలించి వంతెనపె ఏర్పడిన రెండుగుంతలను వెంటనే పూడ్చాలని పలువురు వాహనచోదకులు వాపోతున్నారు.

ఉద్యోగులను ఎలా నియమిస్తారు

● అధికారులను నిలదీసిన పాలకొండ నగరపంచాయతీ కౌన్సిలర్లు


సమావేశంలో అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్లు

పాలకొండ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):కోర్టును గౌరవించండి...కాని అధికారులు ఇష్టానుసారంగా అడ్డదారిలో ఉద్యోగులను ఎలా నియమిస్తారని కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. మంగళవారం నగర పంచాయతీ సర్వసభ్య సమావేశం చైర్మన్ ఆకుల మల్లీశ్వరి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మూడేళ్ల కిందట ఏసీబీకి పట్టుబడిన కేసులో నిందితుడిగా సస్పెండ్ అయిన కె.బద్రిని మళ్లీ ఉద్యోగం ఇవ్వాలని కోర్టు ఇచ్చిన ఆర్డర్‌ను కమిషనర్ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై కౌన్సిలర్ వెలమల మన్మథరావు, కె.బాబీ, దుప్పాడ పాపినాయుడులు స్పందిస్తూ బద్రి స్థానంలో ఇటీవల అడ్డదారిలో ఒకరికి నియమించి మళ్లీ బద్రికి ఏ ఉద్యోగం ఇస్తారని నిలదీశారు. కనీసం కౌన్సిలర్లు తెలియకుండా అడ్డదారిలో నియమించారని తప్పుపట్టారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను పదోన్నతి, జీతాలు పెంపునకు సంబంధించి కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ప్రతిపాదించినా వాటిని ఎందుకు కొర్రీలు పెట్టారని ప్రశ్నించారు. దీనిపై సీనియర్ అసిస్టెంట్ హరి మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పదోన్నతి ఫైల్ పద్ధతి ప్రకారం లేదన్నారు. అందుకే దానిని ప్రమోట్ చేయలేకపోతున్నామన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ హనుమంతురావు, కౌన్సిలర్లు కిల్లారి మోహన్‌రావు, తూముల లక్ష్మణరావు, గంగునాయుడు, రమణ, టి.శంకరరావు పాల్గొన్నారు.

ఎరువుల కొరతపై నిలదీత

● ఉపాధి సిబ్బంది తీరుపై అసంతృప్తి ● వాడివేడిగా మండల సమావేశం


ఎరువుల కొరతపై ఏవోను ప్రశ్నిస్తున్న సభ్యులు

గరుగుబిల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన ఎరువులు కొరతపై ఎంపీటీసీ సభ్యులు నిలదీశారు. ఉపాధి పథకం సిబ్బంది పనితీరుపై అసంతృప్తివ్యక్తం చేశారు. మంగళవారం ఎంపీపీ ఉరిటి రామారావు అధ్యక్షతన గరుగుబిల్లి మండల సర్వసభ్య సమావేశంలో పలుఅంశాలపై వాడివేడి చర్చ జరిగింది. తొలుత నాగూరు ఎంపీటీసీ సత్యనారాయణతో పాటు ఎంపీపీ ఏవో జ్యోత్స్నను ఎరువులకొరతపై ప్రశ్నించారు.ఏపీవో ఎం.గౌరీనాథ్ తీరుతో చెడ్డ పేరు వచ్చిందని సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. సామాజిక తనిఖీబృందం పంచాయతీలో లోపాలను గుర్తించిందని, ఏపీవో తీరు వల్ల టీఏ, ఎఫ్ఏ, కంప్యూటర్ ఆపరేటర్లకు అపరాధ రుసుము విధించారని, మండలంలో రూ.60 లక్షలు ఉపాధిలో అవినీతి జరిగిందని సభ్యులు పేర్కొన్నారు.ఏపీవో నిర్వాహకంపై దర్యాప్తు నిర్వహించి నివేదికలు అందించాలని ఎంపీడీవో జి.పైడితల్లి, ఈసీ డి.తేజేశ్వరరావులను ఎంపీపీ ఆదేశించారు. ఎనిమిది పంచాయతీలకు భవనాలు మంజూరయ్యాయని, అయితే వీటికి స్థల సమస్యనెలకొందని ఆ శాఖ జేఈ జి.గౌరీశంకర్ తెలిపారు. దీంతో తహసీల్దార్ పి.బాల స్పందిస్తూ స్థలం కేటాయించేలా చర్యలు చేపడతామన్నారు.పలు శాఖల అధికారులు గైర్హాజరుకావడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో సభ్యులు కె.భరత్‌కుమార్, అంబటి రాంబాబు, డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు, ఐసీడీఎస్ పీవో జి.సుగుణకుమారి పాల్గొన్నారు.

మట్టి వినాయకులను పూజించాలి

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలకు పూజించాలని వక్తలు పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లాలో పలుచోట్ల మట్టి వినాయక విగ్రహాలను పంపిణీచేశారు.

● సాలూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి):గణేష్ నవరత్రులు పర్యావరణానికి హాని కలగకుండా జరుపుకోవాలని మంత్రి సంధ్యారాణి కోరారు.సాలూరు తహసీల్దార్ కార్యాలయ జంక్షన్ వద్ద మట్టి వినాయక విగ్రహాలను మంత్రి పంపిణీచేశారు.

● పార్వతీపురం/పార్వతీపురంటౌన్/బెలగాం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని జూనియర్ కళాశాల క్రీడామైదానంలో మార్నింగ్ వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు పి.సత్యనారాయణ ఆధ్వర్యంలో మట్టివినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.నోబుల్ వాకర్స్ పాస్టు గవర్నర్ నారాయణస్వామి, మాజీ ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఐ.గున్నేష్‌ల ఆధ్వర్యంలో నెయ్యిల వీధికూడలిలో,లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు చలపతిరావు, బీవీఎస్ నాయుడు ఆధ్వర్యంలో ప్రధాన రహదారిలో వినాయక విగ్రహలను పంపిణీచేశారు.

● పాలకొండ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పాలకొండలోని ప్రభుత్వోన్నత పాఠశాలలో మట్టి వినాయక విగ్రహాలు విద్యార్థులు తయారు చేసి పంపిణీచేశారు.కార్యక్రమంలో హెచ్ఎం నాగభూషణం, ఉపాధ్యాయులు షర్మిలారాణి, రమేష్‌కుమార్ పాల్గొన్నారు.అలాగే ఏలాం జంక్షన్‌లో మట్టి విగ్రహాలను టీడీపీ నాయకుడు పల్లా కొండలరావు, ఎస్ఐ ప్రయోగమూర్తి ఆధ్వర్యంలో పంపిణీచేశారు. కార్యక్రమంలో సంతోష్, కౌన్సిలర్ అడపా బాబ్జీ, రాంబాబు, శ్రీనివాస్, సంతోష్‌గుప్తా పాల్గొన్నారు.

● వీరఘట్టం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నీలానగరంలో మట్టివిగ్రహాలను ఎస్ఐ కళానిధి, హెచ్ఎం రవి ప్రసాద్, ఉమాస్వామి పంపిణీ చేశారు.

మండపాలకు చేరుతున్న గణనాథులు

గరుగుబిల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):గరుగుబిల్లి తదితర గ్రామాల్లో ఉత్సవ కమిటీ సభ్యులు గణనాథులను మండపాలకు తరలిస్తున్నారు. మంగళవారం ఏకధాటి వర్షం కురుస్తున్నా పార్వతీపురం తదితర ప్రాంతాల్లో తయారీదారుల నుంచి విగ్రహాలను వాహనాల్లో మండపాలకు చేరుస్తున్నారు.



పాలకొండ: మట్టి వినాయక విగ్రహాల వినియోగంపై అవగాహనకోసం ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

● సాలూరు రూరల్,ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మామిడిపల్లి, మరిపిల్లి, బాగువలస, పెదబోరబంద, కూర్మరాజుపేట, తోణాం, దండిగాం తదితర గ్రామాల్లో గణనాథులను కొలువు దీర్చడానికి యువకులు ఏర్పాట్లుచేస్తున్నారు.మక్కువ, సాలూరులో 11 కుటుంబాలకు చెందిన వినాయక విగ్రహ తయారీదారుల నుంచి మండపాలకు విగ్రహాలు తరలించారు.

మార్కెట్లో వినాయక చవితి సందడి

పార్వతీపురంటౌన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మార్కెట్లో మంగళవారం వినాయకచవితి సందడి కనిపించింది. వినాయకుని పూజలకు అవసరమైన సరుకుల కొనుగోలుకు పెద్దసంఖ్యలో రావడంతో కొనుగోలుదారులతో కిటకిట లాడింది. ఉదయం ఆరు నుంచి తొమ్మిది గంటల వరకు వర్షం కురవడంతో 11 గంటల తర్వాత చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు పూజా సామగ్రి కొనుగోలు చేసేందుకు తరలివచ్చారు.

● మక్కువ/సాలూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):సాలూరు, మక్కువలో వినాయక చవితి పురస్కరించుకొని సామగ్రి కొనుగోలుకు ఏజెన్సీలోని పలు గ్రామాల నుంచి తరలిరావడంతో మార్కెట్ కిటకిటలాడింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి విగ్రహాలను తీసుకువెళ్లేందుకు యువతరావడంతో మక్కువ కుమ్మరివీధిలో సందడి నెలకొంది.

కోటిపాంలో ఏనుగుల గుంపు

కొమరాడ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కోటిపాం గ్రామ పరిసర ప్రాంతాల్లో రెండు రోజులుగా ఏనుగుల గుంపు బీభత్సం సృష్టిస్తోంది. చిప్పాడ గౌరునాయుడుకు చెందిన జొన్న తోటను, గరుగుబిల్లి శంకరరావుకు చెందిన పత్తి పంట నాశనం చేశాయని వాపోతున్నారు. కౌలుకు తీసుకొని పంట సాగుచేస్తున్నామని, చేతికి వచ్చిన పంట ఏనుగులు ధ్వంసం చేస్తున్నామని లబోదిబో మంటున్నారు. సాయంత్రం ఆరు నుంచి ఉదయం ఆరు గంటల వరకు కోటి పాము పరిసర ప్రాంత ప్రజలు రోడ్లు, పంట పొలాలకు వెళ్లరాదని, అప్రమత్తంగా ఉండాలని ఫారెస్ట్ సిబ్బందికి సహకరించాలని డీఎఫ్‌వో ప్రసూన తెలిపారు.

అభివృద్ధి.. పాలనలో మున్సిపల్టీ!

(5వ పేజీ తరువాయి)

ప్రాంతవాసులకు తాగునీరు అందడం లేదు. పాలకవర్గంలో ఉన్న మెజార్టీ వైసీపీ కౌన్సిలర్లు వాటిపై దృష్టి సారించడం లేదు. మున్సిపల్ అధికారులు కూడా వచ్చామా..? వెళ్లామా! అన్నట్లు వ్యవహరిస్తున్నారు. సామాజిక మరుగుదొడ్లు, రహదారి మరమ్మతు పనులు, కల్వర్టుల నిర్మాణంతో పాటు అనేక సమస్యల పరిష్కారానికి మున్సిపాల్టీకి ఇటీవల రూ.రెండు కోట్ల వరకు మంజూరైనా.. వాటిని సక్రమంగా వినియోగించలేకపోయారు. ఇదిలా ఉండగా కుక్కల సంతాన నిరోధక చికిత్సల పేరిట సాధారణ నిధులు దుర్వినియోగం చేశారన్న ఆరోపణలున్నాయి.

● సాలూరు పురపాలక సంఘానికి పన్నుల బకాయిలు గుదిబండగా మారాయి. ఆదాయం పెంచి తద్వారా అభివృద్ధికి బాటలు వేయాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు 2004లో 15 దుకాణాలు, 2014లో మరో 15 షాపులు నిర్మించారు. వాటిలో 16 షాపులను అద్దెకు ఇచ్చారు. వీటిపై ఏటా రూ.15 లక్షల వరకు రావాలి. కానీ సకాలంలో వసూలు చేయకపోవడంతో రూ.40 లక్షల వరకు బకాయిలు పేరుకుపోయాయి. 11 ఏళ్లుగా 14 దుకాణాలు ఖాళీగా ఉండడంతో మరో రూ.60 లక్షల ఆదాయానికి గండి పడింది. వాటితో పాటు ప్రధాన రహదారికి పక్కన ఉన్న మరో ఐదు దుకాణాలకు రూ.20 లక్షల వరకు రావాల్సి ఉన్నా.. వసూళ్లకు ఎలాంటి చర్యలు లేవు.

● దుకాణాలు లీజుకు ఇచ్చిన అధికారులు ప్రతి మూడేళ్లకొకసారి రెన్యూవల్ చేసి 33 శాతం అద్దె పెంచాల్సి ఉంటుంది. కానీ సాలూరులో అలాంటి చర్యలు కానరావడం లేదు. రెన్యూవల్ చేసి నిబంధనల మేరకు అద్దెలు పెంచాలని వ్యాపారులే కమిషనర్లకు వినతులు ఇచ్చినా పట్టించుకున్న వారే కరువయ్యారు.

పది లక్షలు కూడా లేవు..

మున్సిపాల్టీ ఖజానాలో రూ.10 లక్షలు కూడా లేవు. దీంతో పట్టణంలో సామాజిక మరుగుదొడ్లు, నీటి ట్యాంకులను మరమ్మతులు చేయడం లేదు. కల్వర్టులను కూడా బాగు చేయడం లేదు. నిధులు లేని కారణంగా మూడు లేదా ఆరు నెలలకోసారి పారిశుధ్య కార్మికులు జీతాలు చెల్లిస్తున్న పరిస్థితి ఉంది. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు మరుగునీటి శుద్ధి కోసం సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ మంజూరు చేసింది. నిధులు సైతం కేటాయించినా పనులు మాత్రం ముందుకు సాగడం లేదు.

దర్జాగా కబ్జాలు

మున్సిపాల్టీలో కబ్జాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. ప్రభుత్వ జాగా కనిపిస్తే చాలు యథేచ్ఛగా ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. శనివారం రాత్రికి స్థలం ఆక్రమించి.. సోమవారం ఉదయం నాటికి షాపును ఏర్పాటు చేస్తున్నారు. దీంతో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్నిచోట్ల మురుగునీరు సైతం కదలడం లేదు. చిన్నపాటి వర్షానికే కొన్ని ప్రాంతాలు జలమయమవుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అధికారులు.. ఉద్యోగులు ఇలా..

సాలూరుకు అనేక మంది మున్సిపల్ కమిషనర్లు వచ్చి అనతికాలంలోనే బదిలీపై వెళ్లిపోతున్నారు. 2023లో కమిషనర్ హనుమంతు శంకరరావు ఏసీబీకి పట్టుబడ్డారు. ఆ తర్వాత పని ఒత్తిడి తాళలేక ఆర్వో ఆత్మహత్య చేసుకున్నారు. ఉద్యోగ విరమణకు దగ్గరలోనే శానిటరీ ఇన్‌స్పెక్టర్ మృతి చెందారు. విధి నిర్వహణలో అలసత్వం కారణంగా కమిషనర్ చెక్కా సత్యనారాయణను ప్రభుత్వానికి సరెండర్ చేశారు. ఇన్‌చార్జి కమిషనర్‌గా పనిచేసిన డీటీవీ కృష్ణారావు ఉన్నతాధికారులను పట్టుకుని బదిలీపై వెళ్లిపోయారు. మరో కమిషనర్ జయరాం అతి కొద్ది రోజులకే ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో పట్టుబడ్డారు. ఇన్‌చార్జి కమిషనర్‌గా ఉన్న మున్సిపల్ డీఈ వరప్రసాద్‌ను సరెండ్ చేశారు. విశాఖ నుంచి వచ్చిన టీటీ రత్నకుమార్ ఇటీవల సాలూరు మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆయనపై పట్టణవాసులు ఆశలు పెట్టుకున్నారు.

అభివృద్ధి చేస్తాం..

ప్రభుత్వ సహకారంతో సాలూరు మున్సిపాల్టీని అభివృద్ధి చేస్తాం. ప్రజలు, అధికారులు సహకరించాలి.

- టీటీ రత్నకుమార్, కమిషనర్, సాలూరు

అప్పగించేదెప్పుడు?

(5వ పేజీ తరువాయి)

ప్రశ్నించారు. అత్యవసరమైన పనులు చేపట్టేందుకు సీఎస్ఆర్ కింద ప్రతి పాదనలు పంపితే అనుమతులు మంజూరు చేస్తామన్నారు. ప్రతి ఆసుపత్రికి త్రీఫేజ్ కరెంట్, జనరేటర్ బ్యాకప్, తాగునీరు, మురుగునీటి వ్యవస్థ, మరుగుదొడ్లు, ప్రహరీ, రహదారి, ఇతర మౌలిక వసతులు తప్పనిసరిగా ఉండాలన్నారు. నీటి కుంటలను, రహదారులు, ప్రహరీలను ఉపాధి హామీ కింద చేపట్టాలని సూచించారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు, డీసీహెచ్ఎస్ నాగభూషణరావు, ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీరింగ్ అధికారులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణపై శిక్షణ

సీతంపేట రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):బాలల సంరక్షణపై గ్రామ స్థాయి అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని సీడీపీవో సింహాలమ్మ కోరారు. మంగళవారం జామితోట గ్రామంలో బాలల సంరక్షణ,పరిరక్షణ వంటి అంశాలపై శిక్షణతరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో మన్యం జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎ.సత్యనారాయణ, పి. శ్రీధర్, సర్పంచ్‌లు, వీఆర్‌వోలు, సూపర్‌వైజర్లు, ఔట్ ఇచ్ వర్కర్ హరికృష్ణ, అప్‌హోల్డ్ సంస్థ ప్రతినిధి నిరూపమ పాల్గొన్నారు.

మిషన్ వాత్సల్యపై అవగాహన

సీతానగరం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు నిరోధించడానికి, బాలల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్న మిషన్ వాత్సల్య పథకం అమలుకు సహకరించాలని ఎంపీడీవో ఎంఎల్ఎన్ ప్రసాద్ కోరారు. మంగళవారం సీతానగరంలో ఐసీడీఎస్ పీవో, సూపర్‌వైజర్లతో మిషన్ వాత్సల్య పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సమష్టి కృషితో అభివృద్ధి

భామిని, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నీతిఆయోగ్ ద్వారా ఎంపికైన మనుమకొండ సమష్టి కృషితో అభివృద్ధిచెందుతుందని సీతంపేట ఐటీడీఏ పీహెచ్‌వో గణేష్ తెలిపారు. మంగళవారం మనుమకొండలో అన్ని శాఖల అధికారులు, గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నీతిఆయోగ్ ఏబీఎఫ్ మహేష్, ఏఈ వినోద్, సర్పంచ్ కేశవ,ఏపీవో బాబూరావు, సెక్రటరీ రామినాయుడు, నిమ్మల కోర పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి

వీరఘట్టం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి సాధించవచ్చని ఏవో సౌజన్య రైతులకు సూచించారు. మండలంలోని గంగంపేటలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.